ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మంచిర్యాల
జిల్లా వార్తలు
సోమవారం 20 అక్టోబరు 2025

బిల్లులు రాక ఇబ్బందులు

- తీవ్ర ఒత్తిడిలో హాస్టల్ వార్డెన్లు
- విద్యార్థుల సంఖ్యలో వ్యత్యాసాలు ఉండడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం



మంచిర్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు ఆరునెలలుగా బిల్లులు మంజూరుకావడం లేదు. దీంతో వార్డెన్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. హాస్టళ్లలో రికార్డుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు వాస్తవసంఖ్య సరిపోకపోవడంతో బిల్లులు మంజూరు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వవసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ అమలు చేసేందుకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడానికి వార్డెన్లు ముందుగా తమ డబ్బులు వెచ్చించాల్సి ఉంటుంది. అనంతరం బడ్జెట్ మంజూరుకోసం పైఅధికారికి ప్రతిపాదిస్తారు. దాన్ని ఆ అధికారి జిల్లాస్థాయి ఉన్నతాధికారికి పంపడం ద్వారా బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. రెండురోజుల క్రితం లక్సెట్టిపేట సోషల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం వార్డెన్ రాజగోపాల్ ఆత్మహత్యాయత్నం చేశారు. అధికారుల వేధింపులు, బిల్లులు రాకపోవడంతోనే ఆయన ఆత్మహత్యాయత్నం చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఈ సంవత్సరం లక్సెట్టిపేట హాస్టల్లో విద్యార్థుల సంఖ్య 250కి పెరిగింది. ఈ విషయమై తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని ఓ అధికారి బిల్లులు మంజూరు చేయలేదని తెలిసింది. సదరు అధికారి విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 16రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 17న సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్షితిజకు ఫిర్యాదు చేశారు.

● ఆందోళనకరంగా వార్డెన్ ఆరోగ్యం...

ఈ నెల 18న యాసిడ్‌తాగి ఆత్మహత్యాయత్నం చేసిన లక్సెట్టిపేట ఎస్సీహాస్టల్ వార్డెన్ రాజగోపాల్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉంది. ప్రస్తుతం ఆయన నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

● ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్...

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లకు ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కావడం లేదు. జిల్లాలో 25 ఎస్సీ, 15 బీసీ, 35 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరికి మెనూ అమలు చేసేందుకు రోజుకు ఒక్కొక్కరికి పోస్ట్ మెట్రిక్ వారికి రూ. 70, ప్రీ మెట్రిక్ వారికి రూ. 51 ఖర్చు అవుతోంది. ఈ ఖర్చులన్నీ ప్రస్తుతం వార్డెన్లు వెచ్చిస్తున్నారు. ఆరు నెలలుగా బిల్లులు విడుదల కాలేదు. దీంతో అప్పులు తెచ్చి మరీ హాస్టళ్లను నడిపించాల్సి వస్తోందని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ జరుపుతాం...

లక్సెట్టిపేట ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ రాజగోపాల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విషయం ఇతర వార్డెన్ల ద్వారా తెలిసిందని సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. రాజగోపాల్ ప్రస్తుతం నిర్మల్‌లో చికిత్స పొందుతున్నందున ఆయన్ను కలుస్తా నని తెలిపారు. వార్డెన్‌తో మాట్లాడిన తరువాత వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఏఎస్‌డబ్ల్యూఓపై మంత్రి లక్ష్మణ్‌కు ఫిర్యాదు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు (ఫైల్)



వెలుగు జిలుగుల దీపావళి
- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

7

ఉడుమును స్వాధీనం చేసుకున్న అధికారులు

చెన్నూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తెరసాల గ్రామానికి చెందిన పశువుల కాపరులకు శనివారం రాత్రి సుబ్బరాంపల్లి మూల మలుపు వద్ద ఉడుము కనిపించడంతో దానిని పట్టుకున్నారు. కాపరులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు ఉడుమును స్వాధీనంచేసుకుని చెన్నూరులోని అటవీశాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి పశువైద్యునితో పరీక్షలు చేయించారు. అనంతరం చెన్నూరు అటవీ ప్రాం తంలో వదిలినట్లు ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో సదానందం తెలిపారు.

కొనసాగుతున్న దండారి ఉత్సవాలు

- కాకో అమ్మవారికి నైవేద్యాలు సమర్పణ, పూజలు
- ఆకట్టుకున్న గుస్సాడి నృత్యాలు



సంప్రదాయబద్ధంగా గుస్సాడి నృత్యాలు చేస్తున్న ఆదివాసీలు



గుడిరేవులో పద్మల్ పూరీ కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



దండేపల్లి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గుడిరేవులో పద్మల్‌పూరీకాకో దేవాలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలతో మొక్కులు చెల్లించుకున్నారు. దీపావళి పండుగతో దండారీ ఉత్సావాలు ముగిస్తుండటంతో ఆదివారం ఆదివాసీలు కుటుంబ సమేతంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నుంచే గాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వివిధప్రాంతాల నుంచి వేలాది మంది ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక వాహనాల్లో కాకో ఆలయానికి చేరు కున్నారు. మందుగా గుస్సాడి వేషధారణలతో డప్పుచప్పులతో నృత్యాల మధ్య గోదావరితీరానికి చేరుకుని పుణ్యస్నానం ఆచరించారు. అక్కడి నుంచి దేవాలయానికి చేరుకుని కాకో అమ్మవారిని దర్శించుకుని ఆదివాసీ సంప్రదా యబద్ధంగా దండారీ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజల అనంతరం ఆలయప్రాంగణంలో మహి ళలు రేలా రేలా ఆటపాటలతో నృత్యాలు చేస్తూ, గిరిజనులు గుస్సాడి వేషాదారణలతో కోలాటల నడుమ డప్పుచప్పులతో చూడముచ్చటగా నృత్యాలు, ఆటపాటలతో ప్రత్యేక భజన కార్యక్రమాలతో గిరిజనులు సందడి చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ఆదివాసీల ఆరాధ్యదైవమైన పద్మల్ పూరీ కాకో అమ్మవారిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయ కుడు నడిపెల్లి విజిత్‌రావు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గుస్సాడిలతో గిరిజన సంప్రదా యబద్ధగా ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్‌పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

మందమర్రిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు లేక ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరుతూ జాతీయ షెడ్యూలు కులాల కమిషన్ సభ్యుడు ఒడ్డెపల్లి రాంచందర్‌కు బీజేపీ నాయకులు ఆదివారం వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ మాట్లా డుతూ ఆసుపత్రిలో సౌకర్యాలు లేవని, వైద్యుల కొరత ఉందని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి వస్తుంటారని తెలిపారు. వసతి గృహాల్లో కూడా సౌకర్యాలు లేవని, సరైన భోజనం అందడం లేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తగిన సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించిన బీజేపీ నాయకులు తెలిపారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు గాజుల ముకేష్‌గౌడ్, మంత్రి రామయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ షెడ్యూలు కులాల కమిషన్ సభ్యుడు రాంచందర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

బెల్లంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) నిజామాబాద్ జిల్లాలో పోలీసుకానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్యచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ ప్రమోద్‌ను చంపిన రియాజ్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని, పోలీసునే హత్య చేయడం ఇందుకు నిదర్శ నమన్నారు. కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిర్పూర్(టి), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే పాములు దరి చేరవని ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల హాస్టల్ ఆవరణలోకి రక్తపింజర పాము ప్రవేశించడంతో గమనించిన ఉపాధ్యాయులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, ఎఫ్‌బీవో అరుణ్‌రెడ్డి, వాచర్ ఇర్ఫాన్ అక్కడికి చే రుకుని పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం ఏదూలాపాడ్ గ్రామంలో ఈ నెల 26న నిర్వహించే అమరజీవి వెడ్మ రాము వర్ధంతి పోస్టర్లను ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెడ్మ రాము చేసిన సేవలు, పోరాటాలను కొనియాడారు. గిరిజన హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్రు, సంతోష్‌కుమార్, తిరుపతి, వెంకటేష్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల్లో నైరాశ్యం



- రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుతో స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధం
- గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం

ఆసిఫాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా పిటిషన్ కొట్టి వేస్తూ పాత పద్ధతి లోనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొనడంతో ఆశావహుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. ఎన్నికల మాటమోకానీ, ఇదివరకు ఖరారైన రిజర్వేషన్లు ఉంటాయా..? లేక మారుతాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమైంది. జిల్లాలో 335పంచాయతీలు, 15జడ్పీటీసీ స్థానాలు,127 ఎంపీటీసీ స్థానాలు, 2874 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్ ఎన్నికలషెడ్యూల్‌ను విడుదల చేయడం ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ చేయడంతో స్థానిక ఎన్నికలు జరుగడం ఖాయమని అందరు భావించారు. కానీ ఊహించని విధంగా హైకోర్టు స్తానిక ఎన్నికలపై స్టే విధించడంతో అందరి అంచనాలు తారుమారయ్యాయి. రాష్ట్రసర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా పిటిషన్‌కొట్టి వేస్తూ పాత పద్ధతి లోనే ఎన్నికలు నిర్వహించాలని సూచించడంతో నేతల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేగాని కచ్చితంగా చెప్పలేమంటూ అధికారులు పేర్కొనడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎన్నికలకు సర్వంసిద్ధం చేసుకున్న ఆశావహ నేతలు అయోమయానికి గురవుతున్నారు.

కలిసి వచ్చిన వర్గాల్లో..

స్థానికఎన్నికల రిజర్వేషన్లు కలిసి వచ్చిన వర్గాల్లో కొంత ఆనందం వ్యక్తమైనా అంతలోనే ఆవిరై పోయింది. షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికలకు సిద్ధమైన ఆశావహ నేతలకు హైకోర్టు షాక్ ఇచ్చింది. తిరిగి ఎన్నికలను నిర్వహిస్తే రిజర్వేషన్లు మళ్లీ కలిసి వస్తాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్లపై గ్రామాల్లో వివిధరకాల ప్రచారం జరుగడంతో ఆశావహనేతలు అయోమయానికి గురవుతున్నారు. ఏ నలుగురు కలిసినా రిజర్వేషన్లపైనే మాట్లాడుకోవడం కనిపిస్తోంది. ప్రస్తుతం ఆశావహ నేతలంతా అధికారులకు ఫోన్లు చేస్తూ మరి రిజర్వేషన్లపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు రిజర్వేషన్లపై ఇప్పుడే ఏమీ చెప్పలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు.

మద్దతు ఉంటుందని..

స్థానికఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల కావడంతో అధిష్ఠానం ఆశీస్సులు తమకు ఉంటాయని భావించిన గ్రామాల్లో ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పీటీసీ ఆశావహులు నాయకుల మద్దతు కూడగట్టుకునేందుకు విందులు ప్రారంభించారు. ఈ క్రమంలోనే మందు, విందు పార్టీలను సైతం నిర్వహించారు. ప్రధానంగా దసరా పండగ రోజు ముఖ్య అనుచరులకు ప్రత్యేకంగా దావతలును ఏర్పాటు చేశారు. అప్పుచేసి ఎన్నికలకు అవసరమైన నిధులను సమకూర్చుకున్నారు. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నో హామీలను కూడా ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి నుంచి రిజర్వేషన్లపై అనుమానాలే వ్యక్తమైన చివరికి అనుకున్న విధంగానే ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో తొందర పడి రూ.లక్షలు ఖర్చు చేశామంటూ నేతలు తలలు పట్టుకుంటున్నారు. మళ్లీ రిజర్వేషన్ కలిసి వస్తుందో రాదోనన్న ఆలో చనలో పడ్డారు. కాగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాత పద్ధతి లోనే స్థానిక ఎన్నికలను నిర్వహిస్తే రిజర్వేషన్ల మార్పునకు అవకాశం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

- జాతీయ రహదారిపై బైకును ఢీకొట్టిన కారు
- ఘటనా స్థలంలోనే ముగ్గురి మృతి..మరొకరికి తీవ్రగాయాలు
- అక్క కుటుంబీకులను తమ్ముడు పండుగకు తీసుకెళుతుండగా ఘటన
- న్యాయం చేయాలని మృతుల కుంటుంబీకుల ఆందోళన





మృతిచెందిన జగన్, ప్రజ్ఞాశీల్(ఫైల్)



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హారిక

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. దీపావళి పండుగ వేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాల్సిన సమయంలో' కారు' చీకట్లోకి నెట్టింది. రహదారి ప్రమాదం రూపంలో ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తన అక్కతో పాటు మేనల్లుడు, మేనకోడళ్లను తన ఇంటికి తీసుకు వెళ్లె మామా సైతం రోడ్డు ప్రమాదంలోనే విగత జీవులయ్యాడు. కూతురు, మనుమడు, మనుమరాలు పండుగకు వస్తుందని ఎదురు చూసిన అమ్మమ్మ, తాతయ్యలకు పుట్టెడు దుఃఖం మిగిల్చింది. ప్రమాదం నుంచి బయట పడ్డ చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీపావళి పండుగ వేళ ఊహించని రీతిలో ముగ్గురు చని పోవడం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. భార్య, కుమారుడు, మావమరిది మృతి చెందిన విషయాన్ని భర్త జీర్ణించుకోలేకపోతున్నాడు. దీపావళి వెలుగుల మధ్య గడపాల్సిన ఆ రెండు కుటుంబాలను అంధకారంలోకి నెట్టింది.

మోతుగూడ శివారులో..

ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారి 363పై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన చంద్రి జగన్ దీపావళి పండుగ వేడుకల కోసం కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో ఉంటున్న తన అక్క డోంగ్రే అనసూయతో పాటు మేనల్లుడు, మేనకోడలు డోంగ్రె ప్రజ్ఞాశీల్, డోంగ్రె హారికలను ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై తీసుకుని బెండారకు బయలుదేరాడు. మోతుగూడ ఫ్లైఓవర్ వద్ద వెనుక నుంచి వేగంగా మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న చంద్రి జగన్(27), తన అక్క డోంగ్రె అనసూయ(32), మేనల్లుడు డోంగ్రె ప్రజ్ఞాశీల్(6) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో డోంగ్రె హారికకు తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మంచిర్యాలకు తరలించారు.

మృతుల కుటుంబీకుల ఆందోళన

రోడ్డు ప్రమాదంలో తమ కుటుంబీకులు మృతి చెందారని విషయాన్ని తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంఘటన స్థలానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృత దేహాలను సంఘటన స్థలం నుంచి తరలించకుండ జాతీయరహదారిపై భైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపుల వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి పోయాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐ బాలజీ వరప్రసాద్ ఆందోళన కారులకు నచ్చచెప్పి బాదితులకు న్యాయం జరిగేలా చుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సంఘటన స్థలాన్ని సందర్శించి బాదితులను పరామర్శించారు. సంఘటన స్థలంలో ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి కారకులైన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకొవాలని పోలీసులను సూచించారు. అనంతరం మృతదేహలను ఆసిఫాబాద్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆసిఫాబాద్ ఆసుపత్రి మార్చురీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారి 363పై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కాగజ్‌నగర్ మండలం వంజిరిలో గ్రామానికి చెందిన అనసూయ (32), ప్రజ్ఞాశీల్(6) మృతి చెందడంతో వంజిరిలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో అనసూయ సోదరుడు జగన్(27) కూడా మృతి చెందారు. అనసూయ భర్త సిద్దార్థ క్రెయిన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పండుగ పూట తన తల్లిగారి ఇంటి కి సోదరుడితో బయలు దేరి వెళ్లిన అరగంట వ్యవధిలోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటం అంతా జీర్ణించుకోలేక పోతున్నారు. అప్పటి వరకు చూసిన అనసూయను తలుచుకుంటూ గ్రామస్థులు, బంధువులు రోదించారు. ఇటీవలే ఇందిరమ్మ పథకం కింద ఇ ళ్లు మంజూరైందని, పండుగ తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పిందని, ఇప్పుడు కానిరాని లోకాలకు పోవడం బాధకరమైన విషయమని పలువురు తెలిపారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ సందర్భంగా చిన్నలు పెద్దలు బాణా సంచా కాల్చే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీపావళి ఆనందం, వెలుగుల పండగా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని, బాణా సంచా కాల్చేటప్పుడు తప్పని సరిగా భద్రతా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా ఎ ోలీసులు విధులు చేపట్టనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధురాలికి చేయూత

చింతలమానేపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డబ్బా గ్రామంలో శ్రీ శివరామ సాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ (ఎస్ఆర్ఎస్) స్వచన్ఛంద వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ చొరవతో డబ్బా గ్రామానికి చెందిన పూసల జగదాంబ అనే వృద్ధురాలికి గ్యాస్ సిలిండర్‌తో పాటు 30 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు విలాస్, విజయ్, యువ నాయకులు సంతోష్, సాగర్, మున్నుబాయ్, శేఖర్, రాకేష్, వసంత్, బక్కయ్య, వెంకటేష్, లక్ష్మి, లక్ష్మణ్, జగదీష్, రాకేష్, అశోక్, నవీన్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలలుగా ఎదురుచూపులు

- అందని కారుణ్య నియామక ఉత్తర్వులు
- ఆందోళన చెందుతున్న ఉద్యోగుల వారసులు

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయ్యింది. వారి వారసులు కూడా ఫిట్ అయ్యారు. ఇక ఉద్యోగ పత్రాలు అందుకోవడమే తరువాయి. కానీ ఎందుకో ఏడు నెలలైనా అతీగతీ లేదు. ఈ తర ుణంలో తమ ఉద్యోగ పరిస్థితి ఏమిటని వారసులు ఆందోళన చెందుతున్నారు.

అనారోగ్యంతో మెడికల్‌కు..

సింగరేణి వ్యాప్తంగా చాలా మంది సింగరేణి ఉద్యోగులు కొన్ని నెలల క్రితం మెడికల్ బోర్డుకు వెళ్లారు. వారి అనారోగ్యాన్ని బట్టి ఇన్‌వ్యాలిడేషన్ అయ్యారు. ఇలా అయిన వారి వారసులు 373 మందిని సింగరేణి పరిగణలోకి తీసుకుంది. వారికి వైద్యపరంగా ఫిట్ కూడా చేశారు. కానీ నియామక పత్రాలు ఇవ్వలేదు. ఆర్డర్లు అందితే వెంటనే ఎంవీటీసీల్లో చేరి శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఫిట్ అయిన ఉద్యోగుల వారసులు ఏడు నెలలుగా తమకు ఆర్డర్లు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య, ఇతర సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. వెంటనే ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అయినా వారసుల పరిస్థితి ఎటూ తేలకుండా పోయింది. శనివారం ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వి. సీతారామయ్య, కె. రాజ్‌కుమార్ సైతం సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రును కలిశారు ఆర్డర్లు గతంలోనే ఇస్తామని చెప్పారని, ఇప్పటికైనా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించారు. అంతేకాకుండా ఇతర సమస్యలు సైతం పరిష్కరించాలని కోరారు. యాజమాన్యంతో పాటు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగదా నూతనంగా నియామకం అయితే వీటీసీకి 48 రోజులు పోగా మిగిలిన రోజులు వారి ఉద్యోగంలో సీనియారిటీ ఉండేది. అంతేకాకుండా చేసిన పని దినాలకు వేతనాలు కూడా వచ్చేవి. అయితే నియామకపత్రాలే ఇవ్వకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసలు తమకు ఉద్యోగాలు ఇస్తారా, ఇవ్వరా అని వారసులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్కరికి రూ.2.5లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతన నష్టం జరిగిందని, పైగా కుటుంబ పోషణకు అప్పులయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా యాజమాన్యం మదిలో ఏముందో ఎవరికీ అర్థం కావడం లేదు. గతంలో ఇన్‌వ్యాలిడేషన్ పూర్తికాగానే, జాబితాను ప్రకటించేవారు. వారసుల కుటుంబాలకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూలు, చివరగా వైద్య పరీక్షలు పూర్తి చేసేవారు. ఇప్పటి వరకు అదే పద్ధతి కొనసాగినా ఆర్డర్లు ఇవ్వకపోవడంలో మతలబు ఏమిటనేది సంఘాలు, కార్మికులకు పాలుపోని పరిస్థితి నెలకొంది.

నిలిచిపోయిన మెడికల్ బోర్డు..

ఒకవైపు కారుణ్య నియామకాల పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు నెల, నెలా ఏర్పాటు చేయాల్సిన మెడికల్ బోర్డును నిర్వహించడం లేదు. గత మార్చిలో ఏర్పాటైన బోర్డు తరువాత మళ్లీ ప్రకటన రాలేదు. ఇక బోర్డు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. యాజమాన్యం వెంటనే స్పందించి తమకు ఆర్డర్లు ఇవ్వాలని, న్యాయం చేయాలని 373 మంది ఉద్యోగుల వారసులు సీఎండీ ఎన్. బలరాంను కోరుతున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య శ్రావణి అంత్యక్రియలు



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

దహెగాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామంలో శనివారం హత్యకు గురైన గర్భిణులు శ్రావణి అంత్యక్రియలు పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం నిర్వహించారు. నిండు గర్భిణి హత్య కావడంతో కుల సంఘాలు గెర్రె గ్రామానికి చేరుకున్నాయి. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎస్పీ వాహిదుద్దీన్‌కు అంద జేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలంతో పాటు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హత్యకు పాల్పడిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు. నిందితులకు ఉరి శిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. దీపావళి పండగ ముందు నిండు గర్భిణీ హత్య జరగడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఎస్సైలు అనీల్, సందీప్, గ్రామస్తులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. శ్రావణిపై కత్తి, గడ్డలితో దాడి చేసి కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ప్రజా సంఘాల నాయకులు శ్రావణి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఆనంద్‌రావు, టీకానంద్, తిరుపతి, బక్కన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో అనుమానితుడి ఫొటో విడుదల చేసిన పోలీసులు

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పదిహేను రోజుల క్రితం నిలిపి ఉన్న బైక్‌లో రూ.2.25 లక్షల చోరీ జరిగిన సంఘటనలో ఆదివారం అనుమానితుడికి సంబంధించిన ఫొటోను కాగజ్‌నగర్ పోలీసులు విడుదల చేశారు. ఓ బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసిన సమయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వెళ్లేంత వరకు సీసీ ఫుటేజీలో లభించినట్లు తెలిపారు. ఎక్కడైనా కన్పిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

వాగులు దాటేదెలా..?

- ఆపదొస్తే సాహసం చేయాల్సిందే - నేటికీ పూర్తి కాని పలు వంతెనల నిర్మాణాలు - ఏళ్లు గడుస్తున్నా తీరని వెతలు

కెరమెరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిస్తే చాలు ఆ గ్రామాల ప్రజలు ఆరిగోస పడాల్సిందే. కెరమెరి మండలంలో దశాబ్దం క్రితం మొదలు పెట్టిన వంతెన నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగులు పొంగితే సాహసం చేయక తప్పడం లేదు. మండలంలోని అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులపై వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు లక్మాపూర్ వాగు ఉప్పొంగి ప్రవమించింది. లక్మాపూర్ గ్రామానికి చెందిన కవిత, పవన్ దంపతుల ఏడాదిన్నర వయస్సు గల కుమారుడు ఉండగా అతడికి జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం మం డల కేంద్రానికి వెళ్లాలంటే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. చేసేది లేక ప్రమాదం అ ని తెలిసిప్పటికీ తన కుమారుడిని చేతిలో పైకి ఎత్తి పట్టుకుని నిండుగా ప్రవహిస్తున్న వాగుదాటుతూ మండల కేంద్రానికి చేరుకుని చికితస అందించారు. అలాగే మరో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయ పడగా అతనిడికి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించే క్రమంలో గ్రామంలోని యువకులు అతడిని మంచంపై పడుకోబెట్టి వాగు దాటించారు.

వాగు అవతలి వైపు ఉన్న..

లక్మాపూర్, అనార్‌పల్లి గ్రామాల సమీపంలో వాగు అవతలి వైపు ఉన్న కరంజీవాడ, పెద్ద కరంజీవాడ, జన్కాపూర్, బోరిలాల్‌గూడ, అంద్‌గూడ, శంకర్‌లొద్ది తదితర గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాక పోకలు సాగిస్తారు. అలాగే ఆదివారం జరిగే వార సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారు. వీరందరికి వర్షాకాలం ఓ ఆపద కాలం ఉన్నటుండి వర్షాలు కురిస్తే పస్తులుండాల్సిందే. ఒక వేళ తినడానికి కావాల్సిన గ్రాసం ముందే నిలువ ఉంచుకున్నా ఏదైనా అత్యవసరమైతే ప్రాణాలను పనంగా పెట్టి వాగు దాటాల్సిందే. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా తమ కష్టాలు మాత్రం తీరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న వంతెన

సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య..

మండలంలోని సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు ఉండడంతో వంతెన అవతలి వైపున ఉన్న కేలి(బి), కేలి(కె), పర్సువాడ, గౌరి, లెండిగూడ, బోలాపటార్‌తో పాటు ఇందిరానగర్, ఖైరి, ఆగర్‌వాడ, ఇందాపూర్ తదితర గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని జీవితి గ్రామాల ప్రజలు గంటల తరబడి వరద ఉధృతి తగ్గే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

'బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి'

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మేమెంతో మాకంత రిజర్వేషన్ ఇవ్వాలని సింగరేణి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణి గనులు, విభాగాలపై వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలిపామన్నారు. అసోసియేషన్ పక్షాన అన్ని కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, సభ్యులు ఇందులో పాలుపంచుకున్నారన్నారు. ఆందోళనలో పాల్గొన్న నాయకులకు, కార్మికులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ కేంద్ర కమిటీ నాయకులు మోత్కూరి కొమురయ్య, పొగాకు రమేష్, డివిజన్ నాయకులు రాగం రాజేందర్, జక్కుల సాగర్, కారుకూరి నగేష్, కురుమ వికాస్, తన్నీరు రవీందర్, మోతె లచ్చన్న, కొట్టె శ్రీకాంత్, తౌటం మల్లేష్, మల్లెత్తుల శ్రీనివాస్, సాయిరాజ్, ఆకుల లక్ష్మణ్, దాడి రాజయ్య పాల్గొన్నారు.

ఆవుకు దహన సంస్కారాలు

హాజీపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్ పునరావాస కాలనీలో అత్తె శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం పాము కాటుతో మృతి చెందింది. కాగా ఈ ఆవు ఆ కాలనీలోని పలువురి గృహప్రవేశాల్లో పూజలు అందుకుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన నంనూర్ పాత గ్రామంలోని అభయాంజనేయ స్వామి విగ్రహాల తరలింపులో ఈ ఆవుతో విగ్రహాలను కదలించి ప్రత్యేక పూజలు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆవు పాము కాటుతో మృతి చెందిన సమాచారం అందుకున్న గ్రామస్థులు సంప్రదాయ పద్ధతిలో గోమాతకు దహన సంస్కారాలు నిర్వహించారు.

- చిన్నవర్షం కురిసినా మోకాలు లోతు నీరు
- వర్షాలు లేకున్నా నీరు నిల్వ ఉంటున్న పరిస్థితి
- అండర్ బ్రిడ్జిలో నీరు నిండితే 15 గ్రామాలకు రాకపోకలు బంద్

ఇటీవల కురిసిన వర్షాలకు అండర్ బ్రిడ్జిలో చేరిన నీరు (ఫైల్)



ప్రమాదకరంగా అండర్ రైల్వే బ్రిడ్జిలు

తాండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు గ్రామాలకు వెళ్లే దారుల్లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. తాండూర్ మండలం జాతీయ రహదారి 363ని ఆనుకుని నిర్మించిన అండర్ బ్రిడ్జిలు అస్తవ్యస్తంగా మారాయి. చిన్న పాటి వర్షం కురిసినా రైల్వే అండర్ బ్రిడ్జిలు సగంవరకు నీటితో నిండిపోతున్నాయి. దీంతో దాదాపు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. భీమిని, కన్నెపల్లి మండలాలకు తాండూర్ నుంచే ప్రజలు రాక పోకలు సాగిస్తుంటారు. చిన్న వర్షం పడినా రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడి నెల రోజులు గడిచినా ఇప్పటికి కూడా అండర్ రైల్వే బ్రిడ్జిల నుంచి నీరు మాత్రం బయటకు పోవడం లేదు. నెల రోజుల క్రితం కలెక్టర్ కుమార్ దీపక్ అండర్ బ్రిడ్జిలను పరిశీలించి నీటిని తీసివేయాలని చెప్పినా ఇప్పటి వరకు ఇంకా నీటిని తీసివేయలేదు. దీంతో పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు అండర్ బ్రిడ్జిల్లో నీరు చేరడంతో అధికారులు కొన్నిరోజులు బ్రిడ్జిని మూసివేశారు. దీంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్న వర్షం పడినా అండర్ బ్రిడ్జిలు నీటితో ఉండడంతో విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్యం ఉన్నా బ్రిడ్జిలు దాటలేక ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ట్రాక్ ఉన్నప్పుడు రైళ్లు వెళ్లేదాక వేచి చూసి గేటు తీసిన తర్వాత వెళ్లేవారిమని పలువురు పేర్కొంటున్నారు. అండర్ బ్రిడ్జిల్లో నీరు ఉండడంతో పాకురు పట్టిందని, దీంతో అదుపు తప్పి కింద పడుతున్నామని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న అండర్ బ్రిడ్జిలను రోడ్డు నిర్మాణం చేపట్టిన సంస్థ ఐదేళ్ల పాటు రోడ్లు, బ్రిడ్జిలు, సర్వీసు రోడ్ల బాధ్యతలు చూసుకోవాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే అండర్ బ్రిడ్జిల్లో నిలిచిన నీటిని మోటార్లతో తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాల్సిన రైల్వేశాఖ పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అండర్ బ్రిడ్జిల్లో ఉన్న నీటిలో నుంచి వాహనాలు వెళ్లడంతో వాహనాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. వర్షాలు లేకున్నా బ్రిడ్జి పక్కన నుంచి వాటర్ పంపులగా నీరు రావడంతో అండర్ బ్రిడ్జిల్లో మీటరు లోతులో నీరు నిల్వ ఉంటుంది. రోడ్డు గుంతలుగా ఉండడంతో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అండర్ బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని లేదా గతంలోలాగా రైల్వేగేటు ద్వారా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తాండూర్ అండర్ బ్రిడ్జిలో ఉన్న నీటిలో నుంచి వెళ్తున్న వాహనదారులు (ఫైల్)

ఆటోలు నడపలేకపోతున్నాం..

అండర్ బ్రిడ్జిలో నీరుచేరి ఉండడంతో ఆటోలు నడపలేకపోతున్నాం. దీంతో గిరాకీలు ఉండడం లేదు. ధైర్యం చేసి ఆటోలు నడిపితే ఆటోలు పాడైపో తున్నాయి. గిరాకీలు లేక ఫైనాన్స్‌లు కట్టలేకపోతున్నాం. అధికారులు స్పందించి అండర్ బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. అలాగే శాశ్వతపరిష్కారం చూపించాలి.



- శ్రీనివాస్, ఆటోడ్రైవర్

అండర్‌బ్రిడ్జి దాటడం కష్టంగా ఉంటుంది..

ఏ అవసరం ఉన్నా అండర్ బ్రిడ్జి దాటి తాండూర్ మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. కానీ అండర్ బ్రిడ్జిలో ఎప్పుడు నీరు నిలిచి ఉండడంతో బ్రిడ్జిని దాటలేకపోతున్నాం. వర్షం లేకున్నా కూడా నీరు నిల్వ ఉంటుంది. అండర్‌బ్రిడ్జి లోపల, సమీపంలో లైట్లు లేకపోవడంతో రాత్రివేళలో భయంగా ఉంటోంది.



- శంకర్, అచ్చలాపూర్

అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఉంది..

వర్షం పడినప్పుడు అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలిచి ఉంటుంది. ఈ సమయంలో ఎవరైనా అండర్ బ్రిడ్జి అవతల వైపున ఉన్న గ్రామాల ప్రజలు 108 అంబులెన్స్‌కు సమాచారం అందిస్తే వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. వర్షాలు లేనప్పుడు సైతం అండర్ బ్రిడ్జిల్లో నీరునిల్వ ఉంటుంది. దీంతో ప్రజలు, రోగులు ఇబ్బందులు పడుతున్నార్లు.



- శ్రీనివాస్, 108 అంబులెన్స్ పైలెట్

వెలుగు జిలుగుల దీపావళి

- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి
- పెద్దలు దగ్గర ఉండి పిల్లలను గమనించాలి



దండేపల్లి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటేనే సరదాకి, సంతోషానికి మారుపేరు. అత్యంత ప్రాముఖ్యమైన దీపావళి పండుగను ప్రతిష్టాత్మకంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చిన్న, పెద్ద తేడా లేకుండా బంధువులు, స్నేహితులతో కలిసి టపాసులు కాలుస్తూ కేరింతలు కొట్టడం, అన్నింటిని మరిచిపోయి చీకటి వెలుగు రేఖలను ఆస్వాదిస్తారు. ఈసంబరాల వేళ విషాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం మంచిది.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు

- టపాసులులను కాల్చేటప్పుడు కాటన్ దుస్తులనే ధరించాలి.
- అధిక శబ్దం వచ్చే బాణసంచాను చిన్న పిల్లలు, వృద్ధుల దగ్గర కాకుండా దూరంగా వెళ్లి కాల్చడం మంచిది.
- టపాసులు కాలుస్తున్నప్పుడు ఎల్లప్పుడు ఒక నీళ్ల బకెట్ నీళ్ల మీ వద్ద సిద్ధంగా ఉంచుకోవాలి.
- పెద్దలు దగ్గరుండి పిల్లలతో టపాసులు కాల్పించాలి.
- కంటి అద్దాలు పాద రక్షలు తప్పని సరిగా ధరించాలి.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే భయంతో పరుగెత్తకుండా ఆగి కింద పడుకుని నేలపై బొర్లాలి .
- టపాసులను కాల్చడం పూర్తి అయిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకున్న తరువాతే భోజనం చేయాలి.



చేయకూడని పనులు

- పెద్దలు లేకుండా చిన్న పిల్లలు టపాసులు కాల్చవద్దు.
- ఒకసారి టపాసులకు అంటించి పేలని టపాసులను మళ్లీ అంటించవద్దు.
- ఇంటికి అతి సమీపంలో టపాసులను కాల్చవద్దు.
- వెలిగించిన నూనె దీపాలు, అగరబత్తీలు, కొవ్వొత్తులు నిర్లక్ష్యంగా వదిలివేయవద్దు.
- ఇంటిలోగానీ, దుకాణాల్లో గానీ టపాసులను నిల్వ చేయకండి.
- టపాసులు వెలిగించి నిర్లక్ష్యంగా గాల్లోకి విసరకండి.
- పూరి గుడిసెలకు, గడ్డివాములకు దగ్గరలో టపాసులు వెలిగించకండి.
- ఇంటి చుట్టు పక్కల చెత్త వ్యర్థ పదార్థాలు, సులువుగా మండే వస్తువులను నిల్వ చేయకండి.
- అధికంగా పొగనిచ్చే టపాసులను కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అటువంటి వాటిని కాల్చకుండా ఉండడం మేలు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్సీ ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచదంర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సంగీత సాహిత్య సుధావాహిని కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు పురాణ ఇతిహాసాలపై మక్కువ పెంచుకుని చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముకేష్‌గౌడ్, అశోక్, సుధవాహిని సంస్థ నిర్వాహకులు రాజేశంగౌడ్ , శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం నాయకులు నరెడ్ల శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత

బెల్లంపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు కాల్‌టెక్స్ ఏరియాలో నాలుగు లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత, కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ మున్సిపాలిటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రభుత్వం నుంచి తీసుకొస్తున్నారన్నారు. దీంతో కాల్‌టెక్స్ ఏరియాలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. అలాగే పారిశుధ్యం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణాలను ఏర్పాటు చేసి డ్రైనేజీ సమస్యల తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నెల్లి రమేష్, రాజారత్నం, ప్రభాకర్, నెల్లి సమ్మయ్య, దుర్గయ్య, కుమార్, సుదర్శన్, రాజనర్సు, శ్రీనివాస్, వెంకటేశులువార్డు ప్రజలు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలు.. నిబంధనలకు తూట్లు

లక్షెట్టిపేట, అక్టోబరు, 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ వచ్చిందంటే చాలు మొదట గుర్తుకు వచ్చేది టపాసుల దుకాణాలే. దుకాణాలు పెట్టాలంటే వ్యాపారులు ఫైర్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు పొందాలి. కానీ లక్షెట్టిపేట పట్టణంలో తూతూమంత్రంగా అనుమతులు పొందిన వ్యాపారులు ఇష్టారీతిగా దుకాణాలు ఏర్పాటు చేసినట్టు విమర్శలు వస్తున్నాయి. బానాసంచా దుకాణం మున్సిపాలిటీ అధికారులు కేటాయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అది కూడా జనాలు లేని, నివాసాలకు దూరంగా అధికారులు ఎంపిక చేస్తారు. అధికారు లు చెప్పిన చోట ఏర్పాటు చేసుకున్న దుకాణ సముదాయాల వద్ద అగ్నిప్ర మాదం జరిగితే వెంటనే అదుపు చేసేందుకు నీటి ట్యాంకులు, ఇసుక బకెట్ల తో పాటు ఫైర్ సేఫ్టీ మిషిన్లను అందుబాటులో ఉంచుకోవాల్సి ఉంటుంది. కానీ లక్షెట్టిపేట పట్టణంలోని బానాసంచా వ్యాపారులు వారికి నచ్చిన చోట దుకాణాలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా కనీస నిబంధనలు పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా తాను బస్టాండ్ సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చామని స్థలం కూడా శుభ్రం చేయించామని తెలిఆరు. కానీ వ్యాపారులు జనం సంచరించే ప్రదేశాల్లో పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేసినట్టు తెలిసిందన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని ప్రాంతంలో నెలకొల్పిన దుకాణాలను తీసివేస్తామని తెలిపారు.



లక్షెట్టిపేట బస్టాండ్ పక్కనే ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణం

ఓసీపీ పరిసర ప్రాంతాల పరిశీలన

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

జైపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఓపెన్‌కాస్టులో 'ప్రమాదకరంగా బ్లాస్టింగ్‌లు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం అయింది. దీంతో స్పందించిన అధికారులు ఘటనా స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అధికారులు నిబంధనలు పాటించకుండా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తుం డడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నా రు. శనివారం మధ్యాహ్నం జరిగిన బ్లాస్టింగ్‌లో ఓ మట్టి పెల్ల 350 మీటర్లు పైకి ఎగిరి పత్తి చేనులో పడడంతో వైద్య శేఖర్ అనే రైతుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రమాదకరంగా బ్లాస్టింగ్‌లు అనే కథనం ప్రచురితం కావడంతో సింగరేణి అధికారులు స్పందించారు. ఆదివారం ఘటన జరిగిన ప్రదేశాన్ని బ్లాస్టింగ్ ఇన్‌చార్జి కిరణ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని రైతుకు హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా ఎప్పుడు కూడా ఇలాంటి సంఘటనలు జరగలేదని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



జి కిరణ్ (ఫైల్)

భీమారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుమ్మరివాడ సమీపంలోని నూతనంగా నిర్మించిన కాలనీలో నివాసం ఉంటున్న గాలిపెల్లి తారక్(23) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. తారక్ మంచిర్యాలలోని ఓ కారు షాపులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా తన సొంత ఇంట్లో తల్లిదండ్రులు దేవిక-రమేష్‌తో కలిసి ఉంటున్నాడు. సొంతంగా కారు మెకానిక్ షాపు పెట్టుకోవాలని తల్లిదండ్రులను డబ్బులు అడిగాడు. అంత పెద్దమొత్తంలో డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపంతో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నీతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తండ్రి రమేష్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా తల్లిదండ్రులకు మృతుడు ఒక్కడే కుమారుడు కావడంతో కాలనీ వాసులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

దండేపల్లి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల నాయీబ్రాహ్మణుల కులదైవమైన వైద్య నారాయణ ధన్వంతరి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కంది శంకరయ్య, సంఘం నాయకులు పసుపునూటి రమేష్, నడిగోట్ల శేఖర్, మండల మల్లేష్, పసుపు నూటి తిరుపతి, మర్రిపల్లె వెంకటేష్, రమేష్ శ్రీధర్, రాజన్న, సాయిరాం, రాజన్న, మొగిళి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్‌లో నూతన ఒరవడి

- శ్రీకారం చుట్టిన సింగరేణి - ముందస్తుగా సిద్ధమైన మెడికల్ కార్డులు - ఈ నెల నుంచి అమలు

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ఎంఎస్ (వైద్య సేవలు అందుకునేందుకు) కార్డులు అందించే విధానంలో సింగరేణి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. గతంలోని విధానానికి భిన్నంగా విశ్రాంత ఉద్యోగులకు ముందస్తుగానే మెడికల్ కార్డులు అందించనుంది.

రిటైర్ అయిన తరువాత...

సింగరేణి కార్మికులు రిటైర్ అయిన/మెడికల్ ఇన్‌వ్యాలిడేటెడ్ తరువాత వైద్యం పొందేందుకు సీపీఆర్ఎంఎస్ విధానాన్ని రూపొందించారు. ఈ ప్రక్రియ ద్వారా వారు వైద్యం పొందుతారు.

ఉద్యోగి పనిచేస్తున్న కాలంలోనే వారి వేతనం నుంచి కొంత డబ్బును మినహాయిస్తారు. ఆ డబ్బును వారి సీపీఆర్ఎంఎస్ ఖాతాలో జమ చేసి రిటైర్ అయిన తరువాత మెడికల్ కార్డులు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం సీపీఆర్ఎంఎస్‌కు 60 వేల రూపాయలు మినహాయిస్తున్నారు.

నెల నుంచి 45 రోజుల సమయం

గతంలో ఉద్యోగి రిటైర్ అయిన తరువాత సంబంధిత గని, విభాగం వద్ద దరఖాస్తు అందజేసేవారు. దానిని పరిశీలించి ఆ పథకం అమలు చేయడానికి అవసరమైన కార్డులు మంజూరు చేసేందుకు నెల నుంచి 45 రోజుల సమయం పట్టేది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

ఆస్పత్రిలో ఉపయోగం

సింగరేణి అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే ఉద్యోగులకు వివిధ రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇక రిటైర్ అయిన తరువాత సరేసరి. ఈ తరుణంలో వైద్య సదుపాయం వారికి ఎంతో అవసరం. సీపీఆర్ఎంఎస్ విధానంలోనే వైద్యుల రిఫరెన్స్ లేకుండా నేరుగా సింగరేణి/కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం పొందవచ్చు. ప్రస్తుతం 8 లక్షల రూపాయల వరకు వైద్యం పొందవచ్చు. కాళ్లు, నడుము, కీళ్ల నొప్పులు తదితర అనారోగ్య సమస్యలతో పాటు గుండె జబ్బులు, కేన్సర్, వంటి రుగ్మతలకు కూడా చికిత్స తీసుకునే అవకాశం ఉంది.

ముందస్తుగానే కార్డు

సీపీఆర్ఎంఎస్ కార్డుల జారీలో జాప్యాన్ని నివారించాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఏరియాలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ నెల 31న రిటైర్ కానున్న ఆరుగురు ఉద్యోగుల సమాచారాన్ని పర్సనల్ విభాగం అధికారులు తెప్పించుకున్నారు. దానిని సీపీఆర్ఎంఎస్ విభాగానికి, కార్పొరేట్ కార్యాలయానికి పంపించి ప్రాసెస్ పూర్తి చేసి కార్డులు సిద్ధం చేశారు. రిటైర్ అయిన రోజున సంబంధిత ఉద్యోగులకు అందించనున్నారు. ఈ ప్రక్రియలో పాలు పంచుకున్న పర్సనల్ విభాగం ఉద్యోగి స్వామిని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ముని గంటి శ్రీనివాస్ ఈ నెల 15వ తేదీన సన్మా నించి, బహుమతి అందించారు. డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేటి నుంచి కాళీమాతకు పూజలు

మందమర్రిరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళీనగర్ (పాక్తిస్తాన్ క్యాంపు)లో కాళీమాతకు సోమవారం రాత్రి నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. దీపావళి పండగను పురస్కరించుకుని ప్రతియేడాది కాళీమాతకు పూజలు చేస్తున్నారు. 1970లో బతుకుదెరువు కోసం మందమర్రికి వచ్చి సింగరేణిలో ఉద్యోగాలు సాధించి ఇక్కడే స్థిరపడిన బెంగాలీలు కాళిమాతను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనవాయితీగా వస్తోంది. కాలక్రమేణా పాకిస్తాన్ క్యాంపు కాళీనగర్‌గా మారింది. ప్రతీ సంవత్సరం దీపావళి పండగను పురస్కరించుకుని కాళీమాతను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు మహిళలు ఉపావాసాలు ఉంటూ కాళీమాతకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, ముంబై, భూపాలపల్లి, హైద్రాబాద్, వరంగల్, కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దర్శించుకుంటారు. కాళిమాత విగ్రహాన్ని మట్టితో ఇక్కడే తయారు చేస్తుంటారు. మూడు రోజుల పూజల అనంతరం కాళిమాత విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు.



కాళిమాత విగ్రహం

కోరిన కోర్కెలు తీర్చే దేవత

- రీనారాణిదాస్, ఆలయ కమిటీ సభ్యురాలు



కాళీమాతను పూజించడం వల్ల కోరిన కోర్కెలు తీరుతాయి. మూడు రోజుల పాటు ఉపవాసం ఉంటూ కాళీమాతకు ప్రత్యేక పూజలు చేస్తాం. బెంగాలీ ప్రజల ఆరాధ్య దైవం కాళీమాత. మాతను పూజించడం వల్ల సుఖ సంతోషాలు కలుగుతాయి.

దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు

- బోడ ధర్మేందర్, నిర్వాహకుడు



కాళీమాతను దర్శించుకుని పూజలు చేసేందుకు ముంబై, చంద్రపూర్, బల్లార్షా, వరంగల్, కాగజ్ నగర్, భూపాలపల్లి ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. గతంలో ఇక్కడ నివసించి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు వచ్చి కాళీమాతను దర్శించుకుంటారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు అందరూ కలిసి ఏర్పాట్లు చేస్తారు. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.



- నేడు దీపావళి
- దీపకాంతులతో లోగిళ్ల ముస్తాబు
- లక్ష్మీపూజలకు ఏర్పాట్లు
- రంగురంగుల పూలు, మామిడి తోరణాలతో అలంకరణ

చీకటి వెలుగుల రంగేళి



ఆసిఫాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి అనే సరికి ఢమఢమ భీకర ధ్వనుల బాణాసంచా అర్భా టాలు స్ఫురిస్తాయి. దీపావళి అంటే ఏమిటో గ్రహించి నప్పుడే అందం. ఆనందం. దీపం జ్ఞానానికి ప్రతీక.. ఏ శుభకార్యం జరిగినా జ్యోతి ప్రజ్వలనతోనే ప్రారంభిస్తాం. దీపావళి నాటి వెలుగులు జగత్ నంతటిని కాంతిమయం చేస్తాయి. ప్రతీ వ్యక్తి జీవితంలో దీపావళి ఒక మరుపురాణి పండుగ... ఈ రోజు మహిళలు బొమ్మల పండుగగా జరుపుకుంటారు. ఇంట్లో బొమ్మను కొలువును ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహిస్తారు. వ్యాపారుల దీపావళి నాడు లక్ష్మీ పూజ చేసి తమ దుకాణాలను ప్రత్యేకంగా అలంకరించు కుంటారు. రంగురంగుల పూలు, మామిడి తోరణాలతో దుకా ణాలు, ఇళ్లను అలంకరించుకుంటారు. దీపావళి అం టే దీపాల వరుస. పటాకులు మోతలు.. కాకరపూల కాం తులు,, భూచక్రాల వెలుగులు.. చిచ్చ బుడ్ల జిలు గు లు..పసందైన పిండివంటలే కాదు.. అల్లరి పిల్లలు.. పిల్లల్లా మారే పెద్దలు.. కేరింతలు.. తుల్లింతలు కలిసిన పండుగ. వెలుగుపూల వేడుక. చీకట్లను పార దోలి వెలుగులను నింపే దివ్వెల పండుగ. దీపావళికి అంతా సిద్ధమైంది.

మార్కెట్‌లో పండుగ సందడి..

జిల్లాలో దీపావళి పండుగ సందడి నెలకొంది. దీపా వళి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇక్కడి ప్రాంత వాసులు ఆదివారం జరిపిన కొనుగోళ్లతో వ్యాపార సంస్థలన్నీ కళకళలాడాయి. ప్రధానంగా స్టేషనరీ దుకాణాలు, వస్త్ర దుకాణాలు, పూజా సామాగ్రి విక్రయ కేంద్రాలు సంద డిగా నిలిచాయి. ఉదయం నుంచి కొనుగోలుదారులతో బిజీగా కనిపించాయి. వ్యాపారులు ఉదయం వేళలో ముహూర్తం ప్రకారం స్టేషనరీ దుకాణాలకు వెళ్లి తమకు అవసరమైన ఖాతా బుక్‌లను కొనుగోలు చేశారు. లక్ష్మీపూజ లను ఘనంగా నిర్వహించేందుకు గాను అవసరమైన పూజా సామాగ్రిని కొనుగోలు చేశారు. పట్టణంలోని వస్త్ర దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఏ షా పులో చూసినా సందడే సందడి కనిపించింది. రోడ్లపై పూల దుకాణాలు, ప్రమిదల విక్రయ కేంద్రాలు వెలిశాయి. వ్యాపా రులు తమ తమ సంస్థలను రంగులతో తీర్చిదిద్దుతూ విద్యుత్ బల్బులను అమర్చారు. విద్యుత్ దీపాలతో విర జిమ్మే వెలుగులతో గృహాలు కళకళలాడుతున్నాయి. ఇక టపాసుల విక్రయ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో ఆసిఫాబాద్ పట్టణంలోని టపాసుల దుకాణాల వద్ద సందడి నెలకొన్నది. ఇక బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. మార్కెట్‌లో ఎక్కడ చూసి దీపావళి శోభ సంతరించుకుంది. కాల్చిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధి కారులు చెబుతున్నారు.



ఆసిఫాబాద్‌లో ప్రమిదలు విక్రయిస్తున్న మహిళలు



బెజ్జూరు వారసంతలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

కైరిగూడలో కబడ్డీ పోటీలు

రెబ్బెన, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కైరిగూడ గ్రామ పంచా యతీలో అజ్మీర ఆత్మారాం నాయక్ యువ సేన ఆధ్వర్యంలో ఆదివా రం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అజ్మీరా ఆత్మారాం నాయక్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటలు మానసికోల్లాసానికి శారీర దారుఢ్యతను కలిగిస్తాయ న్నారు. చదువులో కూడా రాణించాలని అన్నారు. గెలుపు ఓటములు అనేది సహజమని చెప్పారు. గెలు పుతో బహుమతిని, ఓటమితో అనుభవాన్ని నేర్చుకో వాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వహకులు శివాజీ, సాయి, సందీప్, అంబదాస్, ప్రదీప్, ఆనంద్, రాహుల్, సుబ్బారావు, శంకర్, గణేశ్, రమేశ్, గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆత్మారాంనాయక్

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చోరీకి పాల్పడిన నిందితుడిని కాగజ్‌నగర్ పోలీసులు పట్టుకున్నట్టు డీఎస్పీ వహీదో ద్దిన్ తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కాగజ్‌నగర్‌లో 2024లో 19.2 గ్రాముల బంగారం, అలాగే మరో చోరీ కేసులో 12 తులాల బంగారం, సిర్పూర్ (టి), చింతలమానెపల్లి, కాగజ్ నగర్ రూరల్ ఏరియాలో 3.31 గ్రాముల బంగారం చోరీ జరిగింది. అలాగే నగదు కూడా చోరీకి గురయింది. ఆయా ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసులో కేసు విచారణ చేసినట్లు తెలిపారు. శనివారం రాత్రి కాగజ్‌నగర్ బస్టాండు ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గౌతం గానో విశ్వాస్(27) అదుపులోకి తీసుకొని విచారించగా తాను చోరీ చేసినట్టు ఒప్పుకున్నట్టు తెలిపారు. విశ్వాస్ స్వస్థలం చంద్రపూర్‌లో ఉండడంతో అక్కడికి వెళ్లి చోరీ జరిగిన 173 గ్రాము బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఇతనికి సహకరించిన సమీర్ మండల్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఏడాది క్రితం కేసును ఛేదించిన పట్టణ సీఐ ప్రేంకుమార్, రూరల్ సిఐ కుమారుస్వామితో పాటు ఎస్సైలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



పండుగ వేళ బస్సులు, రైళ్లలో రద్దీ




కాగజ్‌నగర్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

కాగజ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కోసం వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు గత రెండు రోజులుగా వస్తున్నారు. దీంతో బస్సులు, రైళ్లు పూర్తిగా రద్దీగా వస్తున్నాయి. హైదరాబాద్ నుంచి కాగజ్‌న గర్‌కు వచ్చే వివిధ రైళ్లు, బస్సుల్లో ప్రయాణీకులతో కిటకిటలాడుతున్నాయి. బస్టాండు ప్రయాణీకులతో పూర్తి గా నిండి పోయింది. ఒక వైపు రద్దీ ఉండటం, మరో వైపు సకాలంలో ఇళ్లు చేరేందుకు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లుతున్నారు. ఆర్టీసీలో ఫుట్ బోర్డుతో ప్రయా ణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వందేభారత్ రైలులో ఈ నెల 23 వరకు టికెట్లన్నీ పూర్తిగా బుకింగ్ అయ్యాయి. అలాగే మిగితా రైళ్ల పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉండడంతో ప్రైవేట వాహనాలను ముంద స్తుగానే బుకింగ్ చేసుకుంటున్నారు. పండుగ పూట వివిధ సామగ్రిలు కొనుగోలు చేసేందుకు కాగజ్‌నగర్ మార్కెట్‌లో సైతం కూడా నడువలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్ ఏరియా, అంబేద్కర్ చౌరస్తాలు వివిధ మండలాలు, కాలనీ వాసులతో రద్దీగా ఏర్పడింది. కనీసం ద్విచక్ర వాహనం పోవాలంటే కూడా పోలేని పరిస్థితి నెలకొంది.

చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారుల దాడులు

వాంకిడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని రాష్ట్ర సరిహద్దులో ఉన్న రవాణా శాఖ చెక్ పోస్టపై శనివారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. వాహనాల నుంచి ప్రైవేటు సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణల నేపథ్యం లో ఏసీబీ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. గతంలో నిర్వహించిన దాడుల్లో అధికారులు చెక్ పోస్టు లెక్క లకు మించి రూ.45 వేలు లభ్యమయ్యాయి. కానీ ప్రస్తుతం దాడుల్లో ఎలాంటి నగదు లభించలేదని సమాచారం.





కొనసాగుతున్న దండారి ఉత్సవాలు



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

సిర్పూర్(యు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో దండారి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని ఖాతీగూడకు ఆదివారం లింగాపూర్ మండలం దండారిలు ఆతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు దండారి(ఎతమ్మసార్) దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల దండారి బృందాలు నృత్యాలు చేసి చూపరులను అలరించాయి. కార్యక్ర మంలో గ్రామ పటేల్ సేడ్మకి గణపత్‌రావు, ఉయ్యక అచంత్‌రావు(దండా రి), సేడ్మకి గుణవంత్‌రావు, ఆత్రం రాము, ఆత్రం లక్ష్మణ్, సేడ్మకి బాపురా వు, ఆత్రం జ్యోతిరాం, ఆత్రం నేహ్రూ పటేల్, ఆత్రం ఆనంద్‌రావు, గోడం అ మృత్‌రావు, సేడ్మకి జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.









